



## అధికారుల అనుమతులు ఉన్నా..

- ఆలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నేత



నిర్మాణాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, ఆమె భర్త వెంకట్రాంరెడ్డి

రామడుగు, సెప్టెంబర్ 22 : అధికారులు అనుమతి ఇచ్చినా అధికార కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు అడ్డగిస్తుండడంతో ఆ ఆలయ నిర్మాణం ముందుకు సాగడం లేదు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో వివాదాస్పద ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఆబాది భూమిలో ఉన్న వందల ఏళ్ల నాటి హనుమాన్ ఆలయం శిథిలావస్థకు చేరడంతో, గ్రామస్తులంతా ఐక్యంగా అదే స్థలంలో మూడు నెలల కిందట కొత్తగా ఆలయ నిర్మాణం చేపట్టారు. కాగా, ఆలయ పునర్నిర్మాణాన్ని మొదటి నుంచి అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, ఆమె భర్త వెంకట్రాంరెడ్డి ఆదివారం ఉదయం మరోసారి పనులు జరుగకుండా అడ్డుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం చేపట్టకూడదని పేర్కొంటూ ఆమె మూడు నెలల కిందట పలువురు యువకులపై ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయించడమే కాకుండా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు పలుమార్లు విచారణ చేపట్టిన డీపీవో కలెక్టర్‌కు నివేదిక అందించారు. యథా స్థానంలోనే నిర్మాణం చేసుకోవచ్చని కలెక్టర్‌తోపాటు డీపీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి అనుమతులు అందించారు. దీంతో మూడు నెలలుగా ఆగిన నిర్మాణ పనులను గ్రామస్తులు శనివారం మళ్లీ ప్రారంభించారు. అధికారుల అనుమతులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకురాలు ఆమె భర్త ఆదివారం ఉదయం నిర్మాణ కార్మికుల నుంచి పార, పలుగులను లాక్కొని, ఆలయ నిర్మాణంపై కూర్చొని పనులు జరుగకుండా అడ్డుకున్నారు. నిర్మాణ కార్మికులతోపాటు నిర్మాణం చేపట్టిన గ్రామస్తులను దూషిస్తూ ''పనులు ఎలా చేస్తారో చూస్తా'' అని బెదిరించినట్టు గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై వారు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నిర్మాణాన్ని అడ్డుకోకూడదని చెప్పినా బేఖాతర్ చేసినట్లు గ్రామస్తులు చెప్పారు. దీంతో ఏసీపీ స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయారని తెలిపారు. కాగా, దీనిపై కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రతికా ప్రకటన విడుదల చేస్తూ సరైన ఆధారాలు లేకుండా పంచాయతీ కార్యదర్శిని కరీంనగర్ పిలిపించుకొని అనుమతులు ఇచ్చిన డీపీవో రవీందర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## విలీన ప్రతిపాదన విరమించుకోవాలి

కొత్తపల్లి, సెప్టెంబర్ 22 : కరీంనగర్ కార్పొరేషన్‌లో చింతకుంట గ్రామాన్ని విలీనం చేసే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని గ్రామస్తులు ఆదివారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వానే మాట్లాడుతూ విలీనంతో తమకు లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుందని, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం పోలీసులు రాస్తారోకో చేస్తున్న నాయకులను అదుపులోకి తీసుకుని, తర్వాత వదిలిపెట్టారు. ఈ రాస్తారోకోలో నాయకులు రేణికుంట రాజు, జిట్టవేని వేణయ్య, సురేందర్, భాస్కర్‌నాయక్, అనిల్, శశి, పవన్, పహీం, క్రాంతి, శ్రీకాంత్‌నాయక్, రవూఫ్ పాల్గొన్నారు.

# పంటల లెక్క తేలింది

- జిల్లాలో ఈ వానాకాలంలో 3.63లక్షల ఎకరాల్లో సేద్యం

- వరి సాగే అత్యధికం 3.07లక్షల ఎకరాల్లో పంట
- మరో 56వేల ఎకరాల్లో ఇతర పంటలు
- సర్వే నంబర్లవారీగా మొబైల్ యాప్‌లో వివరాల నమోదు



సారంగాపూర్‌లో వరిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి వాణి (ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబర్22: పంటల లెక్క తేలింది. జిల్లాలో ఈ వానాకాలంలో ఏఏ పంటలు.. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో..? స్పష్టత వచ్చింది. కొద్దిరోజులుగా సర్వే చేస్తున్న వ్యవసాయ శాఖ సర్వే నంబర్లవారీగా పంటల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తూనే, వివరాలు వెల్లడించింది. మొత్తంగా ఎప్పటిలాగే వరి జోరు కొనసాగగా, అత్యధికంగా 3.07లక్షల ఎకరాల్లో సాగైంది. మరో 56వేల ఎకరాల్లో వివిధ పంటలు వేసినట్లు పేర్కొనగా, ఈ లెక్కల ఆధారంగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పంట నష్ట పరిహారాలను ప్రభుత్వం అందచేయబోతున్నది. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై శిక్షణ కూడా అందించనుండగా, రైతుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

### వరిదే సింహభాగం..

జగిత్యాల జిల్లా సేద్యపు ఖిల్లాగా పేరుగాంచింది. వివిధ రకాల పంటలతో అలరారుతున్నది. కాగా, ఈ వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 3,63,931 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు అధికారులు లెక్క తేల్చారు. రైతులు ఎక్కువగా వరి పంటపైనే దృష్టి సారించారు. అత్యధికంగా 3.07లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఆ తర్వాత 31,508 ఎకరాల్లో మక్క, 16,845 ఎకరాల్లో పత్తి, 421 ఎకరాల్లో సోయాబీన్, 1267 ఎకరాల్లో కందులు, 87ఎకరాల్లో పెసర్లు, 395 ఎకరాల్లో చెరుకు, 321 ఎకరాల్లో అనుములు, 7,920 ఎకరాల్లో పసుపు, 21 వెయ్యి ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నట్లు లెక్క తీసి ఆన్‌లైన్ చేశారు. మండలాలవారీగా చూస్తే.. బుగ్గారం మండలంలో 9,172 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేస్తుండగా, అందులో 7,919 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. ధర్మపురి మండలంలో మొత్తం 25,442 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా, 19,648 ఎకరాల్లో వరి, ఎండపల్లిలో మొత్తం 14,351 ఎకరాల పంటలు వేయగా, 10,973 ఎకరాల్లో వరి వేశారు. ఇక గొల్లపల్లిలో మొత్తం 23,857 ఎకరాల పంటల్లో 20,500 ఎకరాల్లో వరి సాగు, పెగడపెల్లి మండలంలో మొత్తం 21,833 ఎకరాల్లో 21,217 ఎకరాల్లో వరి సాగు, వెల్గటూర్ మండలంలో మొత్తం 11,198 ఎకరాల సాగులో 8,250 ఎకరాల్లో వరి వేశారు. ఇక బీర్‌పూర్ మండలంలో 14,011 ఎకరాల సాగులో 11,767 ఎకరాల్లో వరి, జగిత్యాల అర్బన్ మండలంలో మొత్తం 4,280 ఎకరాల సాగులో 4,107 ఎకరాల్లో వరి, జగిత్యాల రూరల్ మండలంలో మొత్తం 25,424 ఎకరాల్లో 20,785 ఎకరాల్లో వరి, కొడిమ్యాల మండలంలో మొత్తం 20,290 ఎకరాల సాగులో 17,396 ఎకరాల్లో వరి, మల్యాల మండలంలో మొత్తం 14,014 ఎకరాలు సాగు చేయగా, అందులో 12,656 ఎకరాల్లో వరి వేశారు. అలాగే మేడిపెల్లి మండలంలో మొత్తం 25,176 ఎకరాలకుగాను 21,713 ఎకరాల్లో వరి, రాయికల్ మండలంలో 24,432 ఎకరాల పంటలకుగాను 19,535 ఎకరాల్లో వరి, సారంగాపూర్ మండలంలో మొత్తం 13,951 ఎకరాల సాగులో 11,839 ఎకరాల్లో వరి వేశారు. ఇక ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం 22,370 ఎకరాల సాగులో 13,057 ఎకరాల్లో వరి, కథలాపూర్ మండలంలో మొత్తం 3,590 ఎకరాల సాగులో 110 ఎకరాల్లో వరి, కోరుట్ల మండలంలో మొత్తం 18,249 ఎకరాలకుగాను 14,508 ఎకరాల్లో వరి, మల్లాపూర్ మండలంలో మొత్తం 27,629 ఎకరాలకుగాను 19,556 ఎకరాల్లో వరి, మెట్‌పెల్లి మండలంలో మొత్తం 31,839 ఎకరాలకుగాను 21,592 ఎకరాల్లో వరి వేశారు.

### పంటల లెక్కలతో ఎన్నో ప్రయోజనాలు

రైతులకు అండగా నిలిచి, సాగులో మెలకువలు నేర్పించేందుకే ప్రభుత్వం రైతుల వారీగా సాగు లెక్కలు నమోదు చేయిస్తున్నది. పంటనష్టం జరిగినప్పుడు పరిహారం పంపిణీ, దిగుబడులను బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం, పంటల సాగుపై శాస్త్రవేత్తలతో తగిన సూచనలు సలహాలు, మార్గదర్శకాలు ఇప్పించేందుకు సర్వే చేస్తున్నది. క్రమంలో కొద్దిరోజులుగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే నంబర్లవారీగా పంటల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని గ్రామాల్లో ఇటీవల డీఏవో పర్యటించి పంటల సాగు నమోదు ప్రక్రియను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

# నవంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు


రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్, సెప్టెంబర్ 22: నవంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్లలోని అమృతలాల్‌శుక్లా కార్మిక భవన్‌లో సీపీఎం పార్టీ వెంకంపేట శాఖ మహాసభలు అల్లె రమేశ్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మూశం రమేశ్ మాట్లాడుతూ, సిరిసిల్లలో పవర్‌లూం కార్మికలకు 8 నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని కార్మిక కుటుంబాలు ఆర్థికం గా ఎంతో ఇబ్బందిలో ఉన్నాయని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వీరికి పని క ల్పించి ఆదుకోవాలన్నారు. అలాగే వెం కంపేట ఏరియాలో కుక్కల బెడద తీవ్రమైందని మున్సిపల్ అధికారులు స్పం దించి చర్యలు తీసుకోవాలని, గాంధీ ద వాఖాన వద్ద మురుగునీరు నిలుస్తుందని శుభ్రం చేయించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన మున్సిపల్ దృష్టి సారించాలన్నారు. ఈ మహాసభల సందర్భంగా సీపీఎం పార్టీ వెంకంపేటశాఖ నూతన కార్యదర్శిగా అన్నల్‌దాస్ గణేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రమేశ్ వెల్లడించారు. ఈ మహాసభలో వెంకంపేటశాఖ సభ్యుడు అల్లె రమేశ్, కుమ్మరికుంట కిషన్, ఎక్కలదేవి జగదీష్, ఆడెపు సంపత్, కోడం సుధాకర్, బొమ్మెన బాలరాజు, పిస్క లక్ష్మణ్, రా ము, కొండ రమేశ్, భీమనాతిని రవి తదితరులు పాల్గొన్నారు.

## కొడుకుపై తల్లి, మరో వ్యక్తి విష ప్రయోగం

- దవాఖానలో చికిత్స
- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 22: తమ అక్రమ సంబంధం ఎక్కడ బయటపడుతుందోనని ఆందోళన చెందిన తన భార్య, సంబంధిత వ్యక్తితో కలిసి తన కొడుకుపై విషప్రయోగం చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో కలకలం రేపుతున్నది. మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గసాగర్‌కు చెందిన ఏనుగు ప్రతాప్ ఉపాధి నిమిత్తం కొన్నేండ్ల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ప్రతాప్ భార్య గ్రామానికి చెందిన మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకున్నదని, ఈ విషయం అతని కొడుకు ప్రత్యక్షంగా చూశాడు. తమ అక్రమ సంబంధం ఎక్కడ బయటపడుతుందోనని ఆందోళన చెందిన తల్లి, సదరు వ్యక్తి కలిసి తన కొడుకుపై విష ప్రయోగం చేశారని తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన తన కొడుక్కి గ్రామంలోనే ఆర్ఎంపీ వైద్యుని వద్ద చికిత్స అందించారని, పరిస్థితి విషమించడంతో మెట్‌పల్లి, తర్వాత నిజామాబాద్ దవాఖానకు తరలించారని తెలిపారు. విషయం తెలియడంతో గల్ఫ్ దేశం నుంచి తండ్రి ప్రతాప్ శనివారం స్వగ్రామానికి తిరిగివచ్చాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడుగగా, శరీరంలో విషం కలిసిందని తెలిపినట్లు చెప్పారు. ఈ విషయమై భర్త ప్రతాప్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. నిజామాబాద్ మెజిస్ట్రేట్ సైతం దవాఖానలో చికిత్స పొందుతున్న బాలుడి వాంగ్మూలం నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## విరిగి పడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం



ముత్తారంలో విద్యుత్ తీగలపై విరిగి పడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం

శంకరపట్నం, సెప్టెంబర్ 22 : మండలంలోని ముత్తారంలో హైమాస్ట్ లైట్ల విద్యుత్ స్తంభం విద్యుత్ లైన్‌పై విరిగి పడింది. ఎలాంటి నష్టం జరుగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం సీతారామ చంద్రస్వామి ఆలయం వెనుక భాగంలోని కుమ్మరివాడలో గతంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. స్తంభం తుప్పు పట్టిపోగా, ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలితో ఒకవైపుకు ఒరిగి పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌పై విరిగి పడింది. ఈ ఘటనలో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. వైర్లు ఒకదానికి ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగి కన్నాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి గంటన్నర తర్వాత విద్యుత్ సిబ్బంది తీగలను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## ఆర్వీఎంకు పార్థీవదేహం అప్పగింత

వీణవంక, సెప్టెంబర్ 22: కొండపాక గ్రామానికి చెందిన ఆవాల మణెమ్మ పార్థివ దేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం అర్‌వీఎం దవాఖానకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతురాలైన మణెమ్మ కోరిక మేరకు ఆమె పార్థీవ దేహాన్ని ఆర్వీఎం వైద్య కళాశాల యాజమాన్యానికి అప్పగించినట్లు చెప్పారు.